సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 7 । జనవరి । 2024



'ల్యాబ్'దాయకం..

డిప్లమా విద్యార్థులకు ప్రయోగాలకు పెద్దపీట వేస్తున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. - 8లో



నిబంధనలు పాటించని వారిపై..

మిల్లర్లపై జేసీ కొరడా ఝుళిపించారు. 31 మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. - 8లో

రెగ్యులర్ రిజిస్ట్రార్‌గా అడ్డయ్య నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం రెగ్యులర్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్యను నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 31న రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ రిలీవ్ కాగా అప్పటి నుంచి అడ్డయ్య ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఇక ఏఫ్ఏసీ నుంచి ఫుల్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నారు.

న్యూస్‌రీల్

25 కేజీల వెన్నతో అలంకరణ



25కిలోల వెన్నతో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి

సారవకోట: మండలంలోని చీడిపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామిని శనివారం 25 కిలోల వెన్నతో అలంకరించారు. ఈ ఆలయంలో గత నెల నుంచి జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి మూల విరాట్‌ను వెన్నతో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు చేపట్టినట్లు అర్చకులు పీసపాటి రామానుజాచార్యులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకుల పంపిణీ పరిశీలన



పాతపట్నం-4 అంగన్‌వాడీలో గర్భిణులకు సరుకుల పంపిణీ పరిశీలిస్తున్న పీడీ శాంతిశ్రీ

పాతపట్నం: పాతపట్నంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి బి.శాంతిశ్రీ శనివారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెబాట పట్టిన నేపథ్యంలో సీడీపీఓ కార్యాలయంలో సీడీపీఓ విమలారాణి, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న పాతపట్నం-4 అంగన్‌వాడీ కేంద్రం, బూరగాం, ప్రహరాజపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సరుకులను పంపిణీని ఆమె పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు బియ్యం, పప్పు, నూనె సరుకులను పీడీ తనిఖీ చేసి పరిశీలించారు. ఆమెతో పాటు సచివాలయ మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ రాజ్యలక్ష్మి బాధ్యతల స్వీకరణ



డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి

అరసవల్లి: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారిగా (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను నిర్వర్తించిన డాక్టర్ భాస్కరరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఈ స్థానంలో విజయనగరం జిల్లా రాజాం ఏరియా ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రాజ్యలక్ష్మికి బాధ్యతలను అప్పగిస్తూ వైద్య విధాన్‌పరిషత్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం కొత్తగా డీసీహెచ్‌ఎస్‌గా రాజ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

8, 9 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం జోన్-1లో ఎంపికైన సివిల్, ఏపీఎస్‌పీ ఎస్ఐ అభ్యర్థులు ఈ నెల 8, 9 తేదీల్లో విశాఖపట్నం రేంజి కార్యాలయానికి తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలని జిల్లా పోలీసు కార్యాలయం గురువారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు విశాఖ రేంజి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అభ్యర్థులు కార్యాలయం సమయాలైన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటలకు హాజరవ్వాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తెచ్చుకోవాలన్నారు.

కూటమిలో కుమ్ములాట



- పాతపట్నం టీడీపీలో ముసలం
- జనసేనతో కలిసి నాలుగు స్తంభాలాట
- కలమటకే టిక్కెట్ అంటూ ప్రచారం
- వ్యతిరేకిస్తున్న మామిడి అండ్ కో

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పొలిటికల్ వాచ్

పాతపట్నంలో టీడీపీ నాలుగు స్తంభాలాట ఆడుతోంది. తనకు టికెట్ ఖాయమైపోయిందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ప్రచారం చేస్తుండగా.. ఆయనకు టికెట్ ఇస్తే తానే ఓడిస్తానని మామిడి గోవిందరావు హెచ్చరిస్తున్నారు. ఈ గొడవతోనే ఆ పార్టీకి తలబొప్పి కడుతుంటే ఆ పార్టీ పాత నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు తాజాగా తెరపైకి వచ్చి తానూ ఇండిపెండెంట్‌గా అయినా పోటీలో ఉంటానని చెబుతున్నారు. ఈ జంఝాటం మధ్య జనసేన ఇన్‌చార్జి గేదెల చైతన్య తనకు కూడా సీటిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇలా గొడవలు, అభిప్రాయ భేదాలు, మాట పట్టింపులతో పాతపట్నంలో టీడీపీ రాజకీయం పతనావస్థకు చేరుకుంది.

బలంగా వైఎస్సార్‌సీపీ..

పాతపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1200కోట్లకు పైగా సంక్షేమ పథకాలు, రూ.800కోట్లకు పైగా నాన్ డీబీటీ పథకాలు అందించడంతో పాటు రూ. వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. దానికి తోడు వంశధార నిర్వాసితులందరికీ చక్కగా పరిహారం అందజేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ చాలా బలంగా కనిపిస్తోంది. మరోవైపు టీడీపీ, జనసేన తమలో తాము కొట్టుకుంటూ ప్రభుత్వంపై బురద జల్లే పని పెట్టుకున్నాయి. కానీ సమన్వయంలోపం కారణంగా ఆ పని కూడా చేయలేక చతికిలపడుతున్నారు.

అంతటా అయోమయం..

టీడీపీకి అలవాటైన డబుల్ గేమ్ పాతపట్నంలో వికటించే పరిస్థితి కనిపిస్తోంది. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన కలమట వెంకటరమణ పార్టీ ఫిరాయించి టీడీపీకి వెళ్లడంతో ఆ పార్టీలో ముసలం పుట్టింది. ఆయన అప్పటికే వంశధార నిర్వాసితుల పరిహారం, ఇసుక, ఇతరత్రా ప్రభుత్వ పథకాల్లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు. కోట్ల రూపాయల కోసమే కలమట పార్టీ మారారన్న విషయం అందరికీ అర్థమైపోయింది. దీంతో 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన కలమట ఘోరంగా ఓడిపోయారు. ఇలాంటి వ్యక్తికి మరోసారి టికెట్ ఇస్తే ఓడించి తీరుమతామని మరో నేత మామిడి గోవిందరావు అండ్ కో బాహాటంగానే చెబుతోంది. కాకపోతే, కలమట వల్ల ఎంత లబ్ధి పొందారో.. ఏ రకంగా ప్రయోజనం కలిగిందో తెలీదు గానీ కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు ఫ్యామిలీ మాత్రం కలమటకు అండగా నిలుస్తోంది. వారి అండదండలే తనకు ఆశీస్సులని, అవే సీటు తెచ్చి పెడతాయని కలమట కొండంత ఆశతో ఉన్నారు. అందుకు తగ్గ సంకేతాలు వస్తున్నాయి. మామిడి గోవిందరావు తనకు పోటీ ఏంటని, వాడుకుని వదిలేస్తామని కలమట బాహాటంగానే చెప్పుకొస్తున్నారు.

టిక్కెట్ ఇవ్వకుంటే..

టీడీపీలో మరో కీలక నేతగా ఎదిగిన మామిడి గోవిందరావు నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఈసారి సీటు తనకే వస్తుందని చెబుతున్నారు. తరచూ చంద్రబాబును, లోకేష్‌ను కలిసి ప్రసన్నం చేసుకుంటున్నారు. వెళ్లిన ప్రతి సారి రూ. లక్షల్లో పార్టీకి చదివించుకుంటున్నారు. ఇలా ఆయన అధిష్టానం దృష్టిలో పడ్డారు. కాకపోతే, ఆయన ఆశలను కింజరాపు ఫ్యామిలీ అడియాశలు చేస్తోంది. మామిడి గోవింద్‌ను వాడుకుంటామని, ఖర్చు పెట్టిస్తామని, అంతమాత్రాన టిక్కెట్ ఇచ్చేస్తామా అని ఒకానొక సందర్భంలో అచ్చెన్నాయుడు బహిరంగంగా చెప్పేశారు. అయినప్పటికీ మామిడి.. లోకేష్ తదితరులకు టచ్‌లోకి వెళ్లి, కింజరాపు ఫ్యామిలీ వ్యతిరేక గ్రూపులో రాజకీయాలు నెరుపుతున్నారు. కానీ ఈయనకు ఇప్పటివరకు స్పష్టమైన హామీ రాలేదు. ఒకవేళ తనకు కాకుండా కలమటకు టిక్కెట్ ఇస్తే నియోజకవర్గమంతా తిరిగి ఓడిస్తానని చెప్పకనే చెబుతున్నారు. కాకపోతే ఇటీవల ఆయనలో స్పీడు తగ్గింది. కార్లు ఇచ్చి డబ్బులిచ్చి తిప్పించడం వంటి పనులు కూడా తగ్గించేశారు.

కలవరం..

ఇదంతా ఓ వైపు సాగుతుండగా.. ఒకప్పుడు టీడీపీలో కొనసాగి, తర్వాత స్తబ్దతగా ఉన్న సిరిపురం తేజేశ్వరరావు ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేస్తానని నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఇప్పుడిది టీడీపీని కలవరపెడుతోంది. మరో మిత్ర పక్షమైన జనసేన పరిస్థితి మరోలా ఉంది. తమకే టిక్కెట్ వస్తుందని ఆశపడుతూనే కలమటతో కలిసి పనిచేయలేమంటూ తమ వైఖరి ద్వారా తెలియజేస్తోంది. ఆ పార్టీ ఇన్‌చార్జి గేదెల చైతన్య తొలుత కొన్ని సార్లు కలమట వెంకటరమణతో కలిసి వేదికలు పంచుకున్నా ఆ తర్వాత దూరం పాటిస్తున్నారు. గతంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న వారితో కలిసి పనిచేయలేమని జనసేన కేడర్ కూడా అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తోంది.

• సంతోషాల వేదిక

ఆనందాలు పంచుతూ, ఉద్వేగాలు తెలుపుతూ, సంతోషాల వేదికగా పింఛన్ల పంపిణీ వేడుక ఊరూరా కొనసాగుతోంది. పెరిగిన పింఛన్‌ను పొందిన ఆనందంలో లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌ను మనసారా ఆశీర్వదిస్తున్నారు. ఇంటికి తెచ్చి పింఛన్ అందించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు.

పెద్ద కొడుకులా..



సీఎం వైఎస్ జగన్ నన్ను పెద్ద కొడుకులా ఆదుకున్నారు. వృద్ధాప్యంలో మేం ఎవరికీ భారం కాకుండా పింఛన్ డబ్బు పెంచారు. ఇంటికే వచ్చి డబ్బులు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. ఆనందంగా ఉంది.

– లంక వరహాలమ్మ, నీలాదేవి పురం, బూర్జ మండలం.



టెక్కలి: సచివాలయం-4 వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు, ప్రజాప్రతినిధులు



మందస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజనులు

డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి



ఫోన్ ఇన్‌లైవ్ కార్యక్రమంలో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని పలువురు విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు సమస్యలు విన్నవించారు. ఇయర్ ఎండ్ డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తే చాలా మందికి డిగ్రీ అర్హత లభిస్తుందని పేర్కొన్నారు. ఒకటి, రెండు సబ్జెక్టులు ఫెయిలైన వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అడ్డయ్య పర్యవేక్షించారు.

కష్టం విని.. కన్నీరు తుడిచి



బాలిక తండ్రికి ఆర్థిక సాయం చేస్తున్న డొంకూరు ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: బడికి ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థిని చెప్పిన కారణం విన్న ఉపాధ్యాయులు తమ సహృదయతను చాటుకున్నారు. మండలం డొంకూరు గ్రామానికి చెందిన మాగుపల్లి ఉష స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ చదువుతోంది. ఆమె శనివారం పాఠశాలకు ఆలస్యంగా రావడంతో ఉపాధ్యాయులు కారణం అడిగారు. దీంతో తన తండ్రి మాగుపల్లి తమ్మయ్య గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని, తాము ముగ్గురం అమ్మాయిలమని, తన తండ్రికి ఇబ్బందిగా ఉండటంతో సపర్యలు చేసుకుంటూ బడికి ఆలస్యంగా వచ్చానని ఆమె ఏడుస్తూ చెప్పింది. అమ్మాయి కష్టం విన్న ఉపాధ్యాయులు, 2018 తెలుగు పండిట్ సేవా సమితి సభ్యులు కలిసి వెంటనే రూ.10550 నగదును సమకూర్చి ఆమెకు అందజేశారు. దీంతో వారిని స్థానికులు అభినందించారు.

సామాజిక న్యాయమే లక్ష్యం

- కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల
- బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల, మంత్రి సీదిరి తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక న్యాయమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెం గ్రామంలో శనివారం సాగర పరిక్రమ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో 7000 కిలోమీటర్ల సముద్ర తీరం ప్రయాణం చేస్తూ మత్స్యకారుల జీవన ప్రమాణాలు, బతుకులు తెలుసుకుంటున్నామని తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.లక్ష అందుతుందని, ఏడుశాతం వడ్డీతో రుణం సకాలంలో చెల్లిస్తే 4 శాతం కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. మత్స్యకారుల శాశ్వత వలసలు నిర్మూలించి స్థానికంగా ఉపాధి కల్పించేలా ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఆర్థిక ప్రగతి సాధించాలి

మత్స్యకారులు ఆర్థిక ప్రగతి సాధించాలని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. రూ.365 కోట్లతో ఇక్కడ హార్బర్ నిర్మాణం జరుగుతోందని వివరించారు. పోర్టులు, హార్బర్లు, జెట్టీల వంటి నిర్మాణాలతో ప్రగతి సాధ్యమని రాష్ట్ర మత్స్య, పాడిపరిశ్రమ శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వివరించారు. కేంద్ర ప్రభుత్వ మత్స్యశాఖ దేశంలో విడుదల చేసిన నిధుల్లో ఏపీకి 10శాతం కేటాయించారని తెలిపారు. దేశంలో సముద్ర తీరం అత్యధికంగా ఉన్న జిల్లాల్లో శ్రీకాకుళం ఐదో స్థానంలో ఉందన్నారు. వలసల నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకార భరోసా, ప్రమాద బీమా వంటివి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, ప్రభుత్వ పథకాలు మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి 7000 కిలోమీటర్లు నిర్వహించిన పరిక్రమ యాత్ర మత్స్యకారులు స్థితిగతులను మార్చుతుందని అన్నారు.

కార్యక్రమంలో కేంద్ర మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నీతూ ప్రసాద్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ట్రైనీ ఐఏఎస్ రాఘవేంద్ర మీనా, జెడ్పీటీసీ రాష్ట్ర ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బల్లాడ హేమమాలినీ రెడ్డి, ఎంపీపీ మొదలవలస చిరంజీవి, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, నాయకులు పూడి తిరుపతిరావు, ఎస్.ఈశ్వరరావు, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, ఎంపీటీసీ బల్లాడ జనార్ధనరెడ్డి, మాజీ సర్పంచ్ అంబటి రాంబాబు పాల్గొన్నారు. మత్స్యకారులకు కె.కె.సి, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన రాయితీ యనిట్లు అందజేశారు. ఎచ్చెర్ల, రణస్థలం మండలాలకు చెందిన మత్స్యకారులు హాజరయ్యారు.



సంఘీభావం తెలుపుతున్న నేతలు

'ఖైదీలు కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలి'



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

గార: ఖైదీలు కుటుంబ సభ్యుల కోసం ఆలోచించి సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. అంపోలు జైలును శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సందర్శించారు. ఈ సందర్భంగా అంపోలు జిల్లా జైలులో ఖైదీలకు అందుతున్న వసతులను వ్యక్తిగతంగా పర్యవేక్షించి ఖైదీల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలంతా వారి కుటుంబ సభ్యుల కోసం ఆలోచించాలన్నారు. మీరు జైల్లో ఉండటం వల్ల కుటుంబ సభ్యులు ఎంతో వేదనకు గురవుతారు కాబట్టి వారి కోసమైనా ఇప్పటినుంచి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారు కోరుకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో గుమ్మిధామ్ ఆశ్రమాధిపతులు



ఆశ్రమాధిపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలోని ప్రఖ్యాత గుమ్మిధామ్ ఆశ్రమాధిపతి గుమ్మి వాలీమాత, ఉత్తరాధికారి జాగృతిదేవిలు తొలిసారి దక్షిణాది యాత్రల్లో భాగంగా అరసవల్లి ఆదిత్యాలయానికి శనివారం విచ్చేశారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరించారు. వాలీమాత, జాగృతిదేవిలు మాట్లాడుతూ హింధూ సనాతన ధర్మం వర్ధిల్లాలని, ఇక్కడి పూజా విధానాలు అద్భుతంగా ఉన్నాయని చెప్పారు. అనంతరం ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆదిత్యుని జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, షణ్ముఖ శర్మ, ఫణీంద్రశర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొనగా..వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ బందోబస్తు నిర్వహించారు.

ఎలుగు హల్‌చల్



రట్టి జీడితోటల్లో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

మందస : ఉద్దాన ప్రాంతాన్ని ఎలుగుబంట్లు భయపెడుతున్నాయి. మందస మండలం భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలో ఎలుగుబంట్లు స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. ఉదయాన్నే జీడితోటలకు, సొంత పనులకు వెళ్తున్న రట్టి ప్రజలకు సమీపంలోని తోటల్లో రెండు ఎలుగుబంట్లు కనిపించాయి. దీంతో భయంతో పరుగులు తీశారు. కొద్దిసేపటి తర్వాత కుక్కలు వెంబడించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

వరి కుప్పలు దగ్ధం



మంటలార్పుతున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని ఆంపురం పంచాయతీ పెంగువాడలో లంబ సూరయ్యకు చెందిన మూడు ఎకరాల వరికుప్పలు (ఇంకా నూర్చలేదు) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయి. శనివారం సాయంత్రం విద్యుత్ తీగలు తెగిపడి మంటలు వ్యాపించినట్లు గ్రామస్తులు, సర్పంచ్ జమ్మయ్య తెలిపారు. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీనిపై తహశీల్దార్ సరోజిని స్పందిస్తూ సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తామని తెలిపారు.

నేడు ఉత్తరాంధ్ర రైతు సదస్సు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉత్తరాంధ్ర రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ప్రముఖ విద్యావేత్త, పల్సస్ గ్రూప్ ఆఫ్ అధినేత గేదెల శ్రీనుబాబు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో రైతులకు వ్యవసాయంలో మెలకువలు, అధునాతన వ్యవసాయంపై దృష్టి పెట్టేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతు కుటుంబాల నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ సదస్సుకి జిల్లాలో రైతులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లింగ వివక్షలేని సమాజం లక్ష్యం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: లింగ వివక్ష లేని సమాజం లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం లింగ వివక్ష, యాంటీ ర్యాగింగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితం విలువ తెలుసుకుని ముందుకు సాగాన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యండ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం క్రైమ్ : అరసవిల్లి స్టేట్‌బ్యాంకు శాఖలో ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ క్యాలెండర్‌ను రీజియన్ సెక్రటరీ వెంకటరమణ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో లోకల్ సెక్రటరీలు క్రాంతి, రమేష్, నాయుడు, ప్రదీప్, శ్రీనివాస్, సంతోష్, రాజు, వసంత, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాబ్‌దాయకం!



సర్వే ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

- డిప్లమో విద్యార్థుల ప్రయోగాలకు పెద్దపీట
- శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రూ.1.20 కోట్లతో ల్యాబ్‌లు
- అధునాతన పారిశ్రామిక అవసరాలపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రవేశాలు పొందే పాలిటెక్నిక్ డిప్లమా కోర్సును సాంకేతిక విద్యాశాఖ పారిశ్రామిక అవసరాలను అనుగుణంగా మార్పులు చేసింది. రాష్ట్రంలో ఉత్తమ విద్య అందించే పాలిటెక్నిక్ కాలేజీల్లో ఒకటైన శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. రూ.1.20 కోట్ల వ్యయంతో ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దృష్టిలో పెట్టుకుని ఈ ల్యాబ్‌లకు రూపకల్పన చేసింది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఐదు డిప్లమా బ్రాంచ్‌లు ఉన్నాయి. సివిల్, ట్రిపుల్‌ఈ, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, నాన్ ఇంజినీరింగ్‌లో కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ నిర్వహిస్తున్నారు. మొత్తం 330 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పాలిటెక్నిక్ ప్రవేశాల్లో ఈ కళాశాలకు మంచి డిమాండ్ ఉంది. ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు ఈ కాలేజీకే ప్రాధాన్యమిస్తారు. ఏటా 300 మంది విద్యార్థులు వరకు రిలీవ్ అవుతుండగా, మూడేళ్లలో 900 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. హైడ్రాలిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, సర్వే, కంప్యూటర్స్, కమ్యూనికేషన్ స్కిల్, లాగ్వేజ్ వంటి ల్యాబ్‌లు అధునాతనంగా తీర్చిదిద్దారు.



హైడ్రాలిక్స్ ల్యాబ్‌లో విద్యార్థుల ప్రయోగాలు

పరిశ్రమలకు అనుగుణంగా..



ప్రస్తుతం విద్యలో నైపుణ్యాలకు ప్రాధాన్యం పెరిగింది. స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయి. క్యాంపస్ డ్రైవ్‌లు, పరిశ్రమలు ఇంటర్వ్యూలకు సన్నద్ధం చేయటంలో ల్యాబ్‌ల పాత్ర కీలకం. సబ్జెక్టుపై పట్టుతో పాటు ల్యాబ్‌లో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ ఎంతగానో ఉనయోగపడుతుంది.

– జి.కిరణ్మయి, డిప్లమా రెండో ఏడాది విద్యార్థిని



ట్రిపుల్‌ఈ ల్యాబ్‌లో ప్రయోగాల్లో విద్యార్థులు

ప్రతిరోజూ ప్రాక్టికల్స్



విద్యార్థులను పారిశ్రామిక అవసరాలకు అనుగణంగా తీర్చిదిద్దటం సాంకేతిక విద్యా శాఖ లక్ష్యం. అందుకు అనుగుణంగా విద్యా అందించాలంటే ప్రయోగాలు కీలకం. సాంకేతిక విద్యాశాఖ రూ.1.2o కోట్లతో ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ఉదయం క్లాస్ వర్కు, రెండో పూట ప్రయోగాలకు ప్రాధాన్యమిస్తున్నాం. విద్యార్థులు సైతం ప్రయోగాలపై ఆసక్తి చూపిస్తున్నారు.

– బి.జానకిరామయ్య, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్

నైపుణ్యాలకు ప్రాధాన్యం..



డిప్లమా పూర్తయ్యాక విద్యార్థులు ఉద్యోగాలకు, ఉన్నత విద్యకు ప్రాధాన్యమిస్తున్నారు. సాంకేతిక విద్యాశాఖ లక్ష్యం మాత్రం రిలీవ్ అయిన విద్యార్థి ఉద్యోగంలో చేరటం. అందుకే పక్కాగా ప్రయోగాలకు, ఇంటర్న్‌షిప్‌కు ప్రాధాన్యమిస్తున్నాం. ప్రస్తుతం స్కిల్డ్ వర్కర్స్‌ను మాత్రమే పరిశ్రమలు తీసుకుంటున్నాయి. అందుకుఅవసరమైన నైపుణ్యాలు విద్యార్థులకు కల్పిస్తున్నాం.

– చదలవాడ నాగరాణి, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్

విషయ పరిజ్ఞానం..



ఉదయం క్లాస్ వర్కు అయ్యాక, ప్రయోగ విద్య కోసం ఎదురు చూస్తాం. ప్రాక్టికల్స్ పట్ల అధిక ఆసక్తి ఉంటుంది. ఒత్తిడి ఉండదు. బ్రాంచి సబ్జెక్టుకు సంబంధించి అన్ని అంశాలను అధునాతన ల్యాబ్‌లో ప్రాక్టికల్‌గా తెలుసుకుంటున్నాం. మరోవైపు కమ్యూనికేషన్ స్కిల్స్ ల్యాబ్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అంశాలు తెలుసుకుంటున్నాం.

– బి.గాయత్రి, డిప్లమా రెండో ఏడాది విద్యార్థిని

● జయహో జగన్నాథ



పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం త్రిభంగానంద ప్రభూచే ప్రహ్లాద మహారాజ ఉపదేశాలపై ప్రవచనం జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

నేడు రంగోయిలో గిరిధర గొమాంగో జుగల్‌బందీ

పలాస : మండలంలోని రంగోయి గ్రామంలో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ డప్పు కళాకారుడు గిరిధర గొమాంగో జుగల్ బందీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జాన పద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు చెప్పారు. శనివారం రంగోయిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి బద్రి అప్పన్న పేరిట 20 ఏళ్ల క్రితం 2004లో కళాపీఠం ఏర్పాటు చేశామని, అప్పటి నుంచి ఏటా జానపద కళాకారులను రంగోయి గ్రామానికి సంక్రాంతి సందర్భంగా ఆహ్వానించి వారి ఆట పాటలను సమాజానికి పరిచయం చేస్తున్నామని చెప్పారు. పేద కళాకారులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి జానపద జాతర ప్రారంభమవుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ చిగిచర్ల కృష్ణారెడ్డి, అంతర్జాతీయ నృత్య కళాకారిణి నిర్మలా నృత్యనికేతన్, రాయలసీమ జానపద గాయకురాలు అనంత ఆణిముత్యం, ప్రవాసాంధ్ర గాయకులు, కళింగ సీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు హాజరై తమ ఆటపాటలతో అలరించనున్నారని వివరించారు.

నిలకడగా స్పీకర్ ఆరోగ్యం

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనడంతో బీపీ, సుగర్ లెవెల్స్ పెరిగాయని, ముందస్తుగా వైద్యపరీక్షలు చేయించుకునేందుకు విశాఖ మెడికవర్ ఆస్పత్రికి రెండు రోజుల క్రితం వెళ్లానని పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు వ్యక్తులు వదంతులు పుట్టిస్తున్నారని, వాటిని నియోజవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఎవరూ అధైర్యపడవద్దని, రెండురోజుల్లో మళ్లీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించని వారిపై కొరడా

- ధాన్యం కొనుగోలుపై సర్కారు ప్రత్యేక దృష్టి
- 31 మిల్లులు బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశం
- ఐదుగురు డీఏటల తొలగింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖరీఫ్ ధాన్యం సేకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఏ స్థాయిలో అధికారులు, సిబ్బంది, మిల్లర్లు తప్పు చేసినా, అలసత్వం వహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ ఖరీఫ్‌లో ఇప్పటికే 2.60 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. తాజాగా జిల్లాలో తూనికల్లో అదనంగా 2 కిలోలు తీసుకుంటున్న మిల్లులపై చర్యలు చేపట్టారు. 31 మిల్లులపై 40 మంది రైతులు ఫిర్యాదు చేయగా, ఆ రైస్ మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. జేసీ ఎం.నవీన్ పూర్తి స్థాయిలో దృష్టి సారించి దర్యాప్తు చేయించి అవినీతికి పాల్పడిన మిల్లులపై చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 260 మిల్లులకు ధాన్యం సీఎంఆర్‌కు అనుమతులు ఇవ్వగా వీటిలో 31 మిల్లులపై వేటు పడింది. అలాగే ఆ మిల్లుల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రైతుల ఫిర్యాదుల మేరకు, ధాన్యం సేకరణలో మిల్లర్లు బస్తాకు 2 కిలోలు ఎక్కువగా తీసుకుంటున్నారని తెలిసిన తక్షణం జేసీ ఆయా మిల్లులపై సంబంధిత ఉప తహసీల్దారులతో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించి వారిపై చర్యలు తీసుకున్నారు. ఇకపై ఏ మిల్లర్ అయినా అదనంగా డిమాండ్ చేస్తే వారిని కూడా బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. గార మండలంలో 2 మిల్లులు, జలుమూరు మండలంలో 2, కోటబొమ్మాళి మండలంలో 4, కొత్తూరు మండలంలో 3, ఎల్ఎన్‌పేట మండలంలో 2, నందిగాం మండలంలో 2, నరసన్నపేట మండలంలో 6, పలాస మండలంలో 2, సారవకోట మండలంలో 3, టెక్కలి మండలంలో 4, వజ్రపుకొత్తూరు మండలంలో 2 మిల్లులు బ్లాక్ లిస్టులో పెట్టారు.

ఐదుగురి తొలగింపు

విధుల్లో అలసత్వం వహించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లను తొలగించారు. రైతు భరోసా కేంద్రాలు, అక్కడ పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, క్వాలిటీ సిబ్బందిపై కూడా వేటు పడింది. క్వాలిటీ కంట్రోల్‌లో అవకతవకలు, తేమ పరీక్షల్లో తేడాలు ఉన్నందున, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సకాలంలో కొనుగోలు చేసిన ధాన్యంను అప్‌లోడ్ చేయడంలో, మిల్లులు ట్రాకింగ్‌లో అవకతవకలు, అలసత్వం వహించినందున, అలాంటి వారిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి వారిని విధుల నుంచి తొలగించారు. సారవకోట మండలంలో పెద్దలంబ ఆర్‌బీకేలో డీఏటీ, కిన్నెరవాడ ఆర్‌బీకేలోని డీఏటీ, నరసన్నపేట మండలంలో బోడవరం డీఏటీ, సరుబుజ్జిలి మండలంలోని పాలవలస డీఏటీ, కొండవలస ఆర్‌బీకేలోని డీఏటలను తొలగించారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

మిల్లర్లు, సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ ఎం.నవీన్ తెలిపారు. పారదర్శకంగా కొనుగోలు సాగాలని, రైతులు ధాన్యంను ఆర్‌బీకేల ద్వారా విక్రయించాలని సూచించారు.

సూరిబాబు సేవలు చిరస్మరణీయం



సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- సంస్మరణ సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: మాజీ జెడ్పీ చైర్మన్ వై.వి.సూర్య నారాయణ(సూరిబాబు) ముక్కుసూటి మనిషని, ఆయన మరణం తీవ్రంగా కలిచి వేసిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని 80 ఫీట్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో శనివారం సూరిబాబు సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాజీవితంలో పరిచయం ఉన్న వారెవరైనా మరచిపోలేని వ్యక్తి సూరిబాబు అని పేర్కొన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన మొట్టమొదటి నాయకుడు సూర్యనారాయణ అని గుర్తు చేశారు. ఎంతటి ఒత్తిడిలో ఉన్నా ఏదైనా పని చెబితే తప్పకుండా చేసేవారన్నారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు మెంటాడ పద్మావతి, పైడిశెట్టి జయంతి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీను, శ్రీకాకుళం, గార ఎంపీపీలు అంబటి నిర్మల, గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణ, ఏఎంసీ చైర్మన్ మూకళ తాతబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, గురుగుబెల్లి లోకనాథం, కార్యనిర్వాహకులు ద్వారపు అజిత్‌కుమార్, తంగి శివ, రుప్ప అప్పలసూరి, టీడీపీ నాయకులు కలమట వెంకటరమణ, చౌదరి బాబ్జి పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



సినీగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 291వ నెల కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఆ పాత మధురాలను వీరాస్వామి, శ్రీనివాసరావు, చంటి, ప్రవీణ్ మంగవేణి, ప్రభావతి, రాజేశ్వరిలు వీనులవిందుగా ఆలపించారు. ఈ సందర్భంగా పౌరాణిక నటుడు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు, డీఎస్పీ సీహెచ్.జి.వి.ప్రసాదరావు, ఆర్.శివరాంలు మాట్లాడుతూ పేద కళాకారులకు నెలవారీ పింఛన్లు పంపిణీ చేయడం గొప్పవిషయమన్నారు. బలివాడ పద్మలక్ష్మీ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన బలివాడ శ్రీనివాసరావును సమాఖ్య సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి, కార్యదర్శి బి.రామచంద్రదేవ్, రమణారావు, పైడి సత్యవతి, కంచరాన అప్పారావు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువతి మృతి



లలిత మృతదేహం

నందిగాం: మండంలోని కొత్తగ్రహారం పంచాయతీ జడ్యాడకు చెందిన తరిణి లలిత(23) పురుగుల మందు తాగి మృతి చెందింది. నందిగాం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్యాడకు చెందిన వ్యవసాయ కూలీలు తరిని వైకుంఠరావు, నాగమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కుమార్తె లలిత. ఈమెకు ఫిట్స్‌తో బాధపడుతోంది. వ్యాధి తీవ్రత పెరగడంతో బాధ తట్టుకోలేక శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం గ్రామానికి తరలించారు.

బైక్ చోరీ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్-2లో ఓ ఇంటి వద్ద బులెట్ బైక్ చోరీకి గురైంది. గాంధీనగర్‌కు చెందిన శ్రీధర్ అనే సెల్‌ఫోన్ వ్యాపారి తెలుపు రంగు బులెట్ వాహనాన్ని తన ఇంటి వద్ద హ్యాండిల్ లాక్‌వేసి ఉంచారు. శనివారం వేకువజామున ఓ యువకుడు వచ్చి తాళం పెకిలి వాహనాన్ని స్టార్ట్ చేయకుండా నడిపించుకుంటూ పరారయ్యాడు. ఈ సన్నివేశం సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో బాధితుడు కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇదే వీధిలో రమేష్ అనే వ్యక్తికి చెందిన పల్సర్ బైకు సైతం నెలరోజుల కిందట చోరీకి గురైంది. సీసీ ఫుటేజీలో దృశ్యం కనిపించినప్పటికీ పోలీసులు పట్టుకోలేకపోయారు. వరుసగా బైకు దొంగతనాలు జరుగుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు సీఐ నవీన్‌కుమార్‌కు విన్నవించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

టెక్కలి రూరల్: స్థానిక పాత జాతీయ రహదారిలో సుదర్శన్ జంక్షన్ సమీపంలో పాన్ షాపులో అక్రమ మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు టెక్కలి ఎస్ఐ-2 రమేష్‌బాబు శనివారం తనిఖీలు నిర్వహించారు. జి.నాగరాజు అనే వ్యక్తికి సంబంధించి పాన్‌షాపులో 17 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ-2 తెలిపారు.

'ఆదిత్య'లో షూటింగ్ సందడి



టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. గజవిల్లి భానుమతి నిర్మాతగా తెరకెక్కనున్న ప్రొడక్షన్ నెంబర్-1 'మాతృదేవోభవ' సినిమా షూటింగ్‌ను టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ప్రారంభించారు. దుర్గా కైలాస్ ఈ చిత్రానికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. డ్యాన్సు, ఫైట్స్, పాటలను జిల్లాకు చెందిన యువకులే కంపోజ్ చేస్తున్నట్లు నిర్మాత వెల్లడించారు.